
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
శనివారం 7 డిసెంబరు 2024



జిల్లాలో మోస్తరు వర్షం


మల్కేపల్లిలో ధాన్యంపై టార్పాలిన్ కప్పుతున్న రైతు

బెల్లంపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు గంట సేపు ఏకధాటిగా వర్షం కురవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే రహదారుల గుండా వర్షం నీరు ప్రవహించింది.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): మల్కేపల్లి, ధర్మారావుపేట, కోనూరు, కాసిపేటలో శుక్రవారం వర్షం కురిసింది. దీంతో రైతులు ధాన్యం పై టార్పాలిన్‌లు కప్పి ధాన్యాన్ని రక్షించుకుంటున్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. పంట చేతికి వచ్చే దశలో వర్షంతో ఆందోళన చెందుతున్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షం అన్నదాతకు కన్నీళ్లు మిగిల్చింది. వర్షానికి పలు గ్రామాల్లో ధాన్యం తడవగా, కొందరు రైతులు వడ్లపై టార్పాలిన్‌లు కప్పుకున్నారు. పత్తి పంట తడిసిపోవడంతో రైతులు నష్టపోయారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



NH 163 నేషనల్ హైవే పనులు ప్రారంభం

- మెరుగు పడనున్న రవాణా సౌకర్యం
- పూర్తి కావొస్తున్న ట్రెంచ్ తవ్వకాలు
- జిల్లాలో 70 శాతం మేర నగదు చెల్లింపులు
- మరో రూ. 15 కోట్ల చెల్లింపులు పెండింగ్
- మూడు రాష్ట్రాల పరిధిలో నిర్మాణం

రవాణా సౌకర్యం మెరుగు పడనుండగా, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల మధ్య రవాణా మరింతగా సులభతరం కానుంది.

మంచిర్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల- వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే-163 పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. హైవే నిర్మాణానికి సేకరించిన భూముల్లో ట్రెంచ్ తవ్వకాలు 70 శాతం మేర పూర్తికాగా, రైతులకు నగదు చెల్లింపులు అంతే శాతం పూర్తయ్యాయి. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ నాలుగు వరుసలు గల నేషనల్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే-163 ని సుమారు 400 కిలోమీటర్ల మేర నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. పట్టణాలు, జనావాసాలకు దూరంగా మైదాన ప్రాంతాల మీదుగా సాగే విధంగా జాతీయ రహదారి నిర్మాణానికి రూపకల్పన చేశారు. మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మంచిర్యాల వయా మంథని వరంగల్ వరకు రహదారి నిర్మాణానికి ప్రతిపాదించారు. రహదారి నిర్మాణం పూర్తయితే మూడు రాష్ట్రాల మధ్య

వేగం పుంజుకున్న పరిహారం చెల్లింపులు

నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం రైతుల నుంచి సేకరించిన భూముల్లో ట్రెంచ్‌ల తవ్వకాల పనులు దాదాపు 70 శాతం మేర పూర్తయ్యాయి. ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు ఆర్బిట్రేషన్ ద్వారా ఎకరాకు రూ.20 లక్షలు చెల్లించేందుకు రైతులతో పరస్పర అంగీకారం కుదరడంతో నగదు చెల్లింపుల్లో వేగం పుంజుకున్నాయి.

హైవే నిర్మాణం కింద జైపూర్ మండలంలో సుమారు 110 హెక్టార్ల భూ సేకరణ జరిపారు. మండలంలోని ఇందారం శివారులోని నర్వా నుంచి పౌనూర్ గ్రామంలోని గోపాల్‌పూర్ వరకు రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. జిల్లాలో మొత్తం 14 గ్రామాల్లోని 110 హెక్టార్ల భూములు రహదారి కోసం సేకరించారు. వీటికి సంబంధించి

మిగతా 7వ పేజీలో..

సందిగ్ధంలో వందల ఎకరాలు....

జాతీయ రహదారి కోసం అధికారులు సేకరించిన భూముల్లో ధరణిలో లేని వాటికి పరిహారం చెల్లించే విషయంలో కొంత సందిగ్ధం నెలకొంది. జిల్లాలో వందల ఎకరాలు ధరణిలో నమోదు కాలేదని తెలుస్తోంది. ప్రభు త్వం ప్రకటించిన విధంగా సాదా బైనామాను ఆన్‌లైన్ చేసుకోవడం కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటి వరకు పట్టాదారు పాస్ పుస్త కాలు అందలేదు. మరోవైపు ధరణి పోర్టల్ లోనూ నమోదు చేయలేదని సమాచారం. దీంతో సంబంధిత రైతులు ఆందోళన చెందుతున్నారు.


జైపూర్ సమీపంలో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్ (ఫైల్)

మున్సిపాలిటీలో వార్డు అధికారులు

- ఇకపై కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ప్రతీ వార్డుకు ఒక అధికారి
- క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పరిశీలన

6



వేణుగానంలో రాణిస్తున్న ఎస్టీపీపీ ఉద్యోగి

- కోలిండియా పోటీల్లో పతకాలు కైవసం
- పలు ఆలయాల్లో ప్రదర్శనలు

7


కోలిండియాలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో వేణుగానం చేస్తున్న రవీంద్రకుమార్

మహిళా కాంగ్రెస్ నాయకురాలి సస్పెన్షన్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల టౌన్ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న పుట్ట లావణ్యను సస్పెండ్ చేసినట్లు ఆల్ ఇండియా మహిళ కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా, పార్టీ ప్రతిష్ఠకు భంగం కల్గించే విధంగా ప్రవర్తిస్తుండటంతో ఆమెను పదవి, పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

పొంచి ఉన్న ప్రమాదం

విద్యుత్ తీగలకు కర్రే ఆధారం...


లింగాపూర్ గ్రామ శివారులోని పంటపొలంలో కర్ర విద్యుత్ స్తంభం

దండేపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లింగాపూర్ గ్రామ శివారులో ఆలీపూర్, గుడిరేవు గ్రామాలకు వెళ్లే రోడ్డులోని ఓ పంట పొలంలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలను దూరంగా వేయడంతో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. విషయం అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని రైతులు తెలిపారు. దీంతో రైతు పొలం గట్టుపై విద్యుత్ స్తంభం మాదిరిగానే కర్రను ఏర్పాటు చేసి తీగలు వేలాడకుండ ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

అంబేద్కర్ ఆశయసాధనకు కృషి




మంచిర్యాలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాలమహానాడు నాయకులు, మందమర్రిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు, హైద్రాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

దండేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని లక్సెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చందు అన్నారు. మేదరిపేట నుంచి దండేపల్లి వరకు దళిత సంఘాల నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పులమాల వేసి నివాళులర్పించారు. దేశంలో కులరహిత సమాజం కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశాడన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలో మాలమహానాడు నాయకులు ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కొనియాడారు. రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, మధుబాబు, ప్రకాష్, మనోజ్, ప్రభాకర్ పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజన్న, అశోక్, రాకేష్, అర్జున్, శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకన్న, శ్రీనివాస్,రాకేష్, ప్రభాకర్, రాజబాబు పాల్గొన్నారు.

రాముని చెరువు వాకర్స్ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గజెల్లి వెంకటయ్య, రమేష్, రామిరెడ్డి, రాజిరెడ్డి, వీరస్వామి, కృష్ణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): సీసీసీ కార్నర్ వద్ద మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, నాయకులు కూన రవికుమార్, శ్రీనివాస్, దాసరి వెంకటరమణ, గోసిక మనోజ్, తలారి రాజయ్య, ఐత రమేష్, పండగ శ్రీధర్, పాల్గొన్నారు. సీసీసీ టౌన్‌షిప్‌లో అంబేద్కర్ సంఘాల, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి కొంద్ర లింగయ్య, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునిల్, నాయకులు గద్దల బానయ్య, చుంచు శంకర్ వర్మ, పాల్గొన్నారు.

కోటపల్లి, (ఆంధ్రజ్యోతి): కోటపల్లి, సర్వాయిపేట గ్రామాల్లో బీఎస్పీ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెన్నూరి రాజు, సుందిళ్ల అశోక్, దుర్గం మధుకర్, గడ్డం శేఖర్, బానేష్, నాగేష్, శంకర్, శివ, రాకేష్,వెంకటేష్, పాల్గొన్నారు.

జన్నారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు భరత్‌కుమార్, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ప్రభుదాస్, బెంజిమన్, కడార్ల నర్సయ్య, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ వర్ధంతిని దళిత బహుజన సంఘాల నాయకులు నిర్వహించారు. కాసిపేట, దేవాపూర్, మల్కేపల్లి, ముత్యంపల్లి, కోమటిచేనులో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమవేదిక నాయకులు అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. నాయకులు సుదర్శన్, ప్రభాకర్, రాజ్‌కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొసైటీ జనరల్ సెక్రెటరీ చందూరి మహేందర్, సభ్యులు శంకరయ్య,రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. దేశానికి అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. శ్రీనివాసులు, జేఎన్ సింగ్, సత్యనారాయణ, సముద్రాల శ్రీనివాస్, మదన్ మోహన్, పంతుల, అజ్మీర తుకారాంలు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, మాల సంఘం నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలుర్పించారు. మల్లేష్, మంతెన లక్ష్మణ్, శీలం వెంకటేశం, గద్దల అనిల్, రాము, పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో అంబేడ్కర్ వర్ధంతిని జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామ్మోహన్, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, సతీష్, రాంకుమార్, పాల్గొన్నారు.

పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఐబీ ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. తూముల నరేష్, పూదరి తిరుపతి, రామగిరి బానేష్ పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కాలనీ అంబేద్కర్ భవనం వద్ద ప్రజా సంఘాల నాయకులు అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుర్గం నానయ్య, దాగం రాజారాం, దుర్గం రాజేశం, పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ విగ్రహానికి సంఘం నాయకులు మొయ్య రాంబాబు, వీరస్వామి, పల్లె నర్సింహులు, కనకం రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జర్నలిస్టులు, సింగరేణి గ్రీన్ పార్కులో జాతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేష్‌కుమార్, విజయ్‌కుమార్, రాంచందర్, రమేష్, శ్రీనివాస్, సాంబయ్య పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి ఎస్ఐ రాజశేఖర్, తహసీల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నివాళులర్పించారు.

అంబేద్కర్ అందరికి స్ఫూర్తి అని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. హైద్రాబాద్‌లోని ట్యాంకు బండు వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలుర్పించారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణంలో అంబేద్కర్ వర్ధంతిని ఎమ్మార్పీఎస్ నాయకులు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి):ఆదిల్‌పేటలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ వేల్పుల రవి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్‌గౌడ్, ఆకుల చందు, జంపన్న, సునీల్, సతీష్, సాగర్, పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారని ఏరియా జీఎం సూర్యనారాయణ అన్నారు. కార్యాలయం ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్సీ లైజన్ అధికారి కిరణ్ కుమార్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, సిక్కా ఏరియా అధ్యక్షుడు కన్న బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ నాయకుల రిలే నిరాహార దీక్ష


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, కల్పించాలని శుక్రవారం ఐబీ చౌరస్తాలో ధర్మ సమాజ్‌పార్టీ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ప్రజలందరికి నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. అర్హులైన నిరుపేదలకు ఎకరం భూమి, సాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పేదలందరికి 200 గజాల ఇంటి స్థలంతో పాటు 4 గదుల ఇంటిని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల పక్షాన ధర్మ సమాజ్ పార్టీ పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. జంగపెల్లి రామస్వామి, నందిపాటి రాజు, తాళ్లపల్లి చంద్రశేఖర్, గొడిసెల సురేందర్, అజయ్, క్రాంతి, సందీప్, కళ్యాణ్, కిరణ్, మారుతి, రమేష్, మనోహర్, శ్రీనివాస్, రాజాచారి, సంతోష్‌బాబు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి


సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

గర్మిళ్ల/లక్సెట్టిపేట రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని శుక్రవారం ఐబీ చౌరస్తా నుంచి లక్సెట్టిపేటలోని ఉత్కూరు చౌరస్తా వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి బీసీల చిరకాల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. దేశ జనాభాలో 60 శాతం, రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలు రాజ్యాధికారానికి ఆమడదూరంలో ఉన్నారన్నారు. 36 పార్టీలు బీసీ రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా ఉన్నాయని, వెంటనే రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు భీమ్‌సేన్, నర్సయ్య, కోటేశ్వర్‌రావు, లింగయ్య, మనోహర్, రమేష్, బిక్షపతి, రాజేశ్వరి, పాల్గొన్నారు.

కాంటా చౌరస్తాకు అంబేద్కర్ పేరు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత

బెల్లంపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంటా చౌరస్తాకు అంబేద్కర్ చౌరస్తాగా నామకరణం చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సుమారు 60 ఏండ్లుగా కాంటా చౌరస్తాగా పేరుండేదని, మున్సిపల్ సమావేశంలో అంబేద్కర్ చౌరస్తాగా ప్రతిపాదిస్తూ తీర్మానించామన్నారు. ప్రజలు అంబేద్కర్ చౌరస్తాగా గుర్తించాలని సూచించారు. కౌన్సిలర్లు గెల్లి రాజలింగు, సురేష్, ఎలిగేటి శ్రీను, నాయకులు కుంబాల రాజేష్, చిలుక రాజనర్సు, యాదగిరి పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సభను విజయవంతం చేయండి

తాండూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలోని తాపీ సంఘం భవనంలో ఈనెల 8న జరిగే టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి దేవదాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు ఆటోల బంద్

జన్నారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఆటోల బంద్ నిర్వహిస్తున్నట్లు ఆటో యూనియన్ నాయకులు సతీష్, మాణిక్యం, లక్ష్మణ్‌లు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బంద్‌లో ఆటో డ్రైవర్లందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సత్తన్న, నర్సయ్య, తిరుపతి, నహీం, రాజన్న, మునీర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బెల్లంపల్లిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న బూద పరిధిలోని ఇందిరానగర్ ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీని శుక్రవారం రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేశారు. ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తమ దృష్టికి రావడంతో కూల్చివేస్తున్నట్లు ఆర్ఐ ఆదిలక్ష్మీ తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవని ఆమె హెచ్చరించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎన్ఎస్ఎఫ్ నాయకులు

నస్పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు, సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ ఏవోకు అందజేశారు. ఆశిష్, అమోఘ్, రంజీత్, వాసు, సాయికృష్ణ, పాల్గొన్నారు.

అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేయాలి

కన్నెపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా రేవతి అనే మహిళ మృతి చెందడం బాధాకరమని, ఈ విషయంపై అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ప్రగతి శీల యువజన సంఘం నాయకుడు మనోహర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. థియేటర్ వస్తున్నానని ముందుగా సమాచారం ఇవ్వకుండా అల్లు అర్జున్ రావడంతో తొక్కిసలాటలో మహిళ మృతి చెందగా ఆమె కుమారుడు తీవ్ర గాయాలపాలయ్యాడన్నారు. వెంటనే ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మండల స్థాయి పోటీల నిర్వహణపై సమావేశం

నస్పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి సీఎం కప్-2024 పోటీల నిర్వహణపై శుక్రవారం మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, విద్యాధికారి దామోదర్ రావులు సమావేశమయ్యారు. అథ్లెటిక్స్, వాలీ బాల్, ఫుట్‌బాల్, ఖోఖో, యోగా క్రీడాంశాల మండల స్థాయి పోటీలు ఉంటాయని అధికారులు తెలిపారు. క్రీడాకారులు ఈ నెల 9న సాయంత్రం లోపు పేర్లను మండల ఇన్‌చార్జీలు జ్యోతి 7013926255, విఠల్ 9963313653ల వద్ద నమోదు చేసుకోవాల న్నారు. పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు విజయవంతం అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. ఏఎస్ఐ శకుంతల, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నర్సింహులు, తిరుమల పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

కాసిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేగాన్ని నిరోధించేందుకు వేసిన స్పీడ్ బ్రేకర్ మహిళ మృతికి కారణమైంది. కళ్ల ముందే భార్య ప్రాణాలు కోల్పోయింది. దేవాపూర్ చెందిన సురేందర్‌సింగ్ భార్య కుసుందేవి (32), నాలుగేండ్ల కూతురుతో కలిసి బైక్‌పై దేవాపూర్ నుంచి మంచిర్యాలకు వెళ్తున్నారు. ముత్యంపల్లి మహారాజుల కాలనీ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక కూర్చున్న కుసుందేవి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు ఆడపడుచు సరిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రవీందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నెన్నెల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దమ్మిరెడ్డిపేట గ్రామానికి చెందిన పసుల పోషం (74) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గురువారం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లగా ఇంటి వద్ద పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన చుట్టు పక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంచిర్యాలకు తరలించారు. పోషం చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య బానక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

విద్యుదాఘాతంతో హార్వెస్టర్ డ్రైవర్‌కు గాయాలు


కాలిన గాయాలతో డ్రైవర్ సంతోష్

నెన్నెల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నెన్నెల శివారులో శుక్రవారం పొలం కోస్తుండగా హార్వెస్టర్ డ్రైవర్ కరెంట్ షాక్‌తో తీవ్ర గాయాలపాలయ్యాడు. లంబాడితండాకు చెందిన ధరవత్ సంతోష్ (కొండయ్య) హార్వెస్టర్‌తో పొలం కోస్తున్నాడు. పొలం పైనుంచి నెన్నెల నుంచి బొప్పారం వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్ ఉంది. ధాన్యం డబ్బా నిండిందో లేదో చూసేందుకు సీటు నుంచి లేచి నిలబడటంతో పైనున్న తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. మొఖానికి, ఎడమ భుజానికి కాలిన గాయాలయ్యాయి. రైతులు వెంటనే ట్రాక్టర్‌లో రోడ్డు వరకు తరలించి అక్కడి నుంచి ఆటోలో బెల్లంపలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై ప్రసాద్, విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ సుమీన్ సందర్శించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జైలుశిక్ష

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిపిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 18 మందికి సెకండ్ అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.నిరోష జైలుశిక్షను విధించినట్లు ట్రాఫిక్ సీఐ బి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. పట్టుబడిన 18 మందిని శుక్రవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా 8 మందికి వారం రోజుల పాటు జైలుశిక్ష, 10 మందికి ట్రాఫిక్ విధులు నిర్వహించాలని శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పును వెలువరించినట్లు సీఐ తెలిపారు.

పశువుల మందపై పులి దాడి

సిర్పూర్(టి), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చీలపల్లి గ్రామంలో శుక్రవారం మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లిన పశువుల మందపై పులి దాడిచేసింది. దీంతో పశువుల కాపర్లు ఒక్కసారి చెట్టెక్కగా పశువులు చెల్లా చెదురుగా పారిపోయాయి. పులిదాడిలో ఒక గేదె గాయపడగా, దూడ అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎఫ్ఆర్వో ఎక్బాల్ అటవీ శాఖ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరిం చారు. గాయ పడ్డ గేదెకు చికిత్స చేయిస్తామన్నారు.

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు అక్రమంగా తరలిస్తున్న దేశీదారును శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తమకు ముందస్తు అందిన సమాచారం మేరకు కాగజ్‌నగర్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా, కాగజ్‌నగర్‌కు చెందిన ఇమ్రాన్ నజీర్ మహారాష్ట్ర నుంచి బైక్‌పై 198దేశీదారు (90ఎంఎల్) బాటిళ్లను తెస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు బాటిళ్లను స్వాధీనం చేసుకొని నజీర్‌పై కేసు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న సీఐ అఫ్జలుద్దీన్

బెల్లంపల్లిరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన ఎండల కమలను గురువారం రాత్రి హత్య చేసిన నిందితుడు కమ్మరి మహేష్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాళ్లగురిజాల రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. తాళ్లగురిజాల సర్కిల్ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన కమ్మరి మహేష్‌కు ఇదే గ్రామానికి చెందిన మౌనికతో మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కూలీ విషయంలో మహేష్‌కు భార్య మౌనిక, అత్త పద్మ మధ్య గొడవ జరిగింది. దీంతో మౌనిక తల్లి వద్దకు వెళ్లింది. మహేష్ అత్త ఇంటికి వద్దకు వచ్చి భార్యను పంపించాలని గొడవకు దిగాడు. దీంతో ఇంటి సమీపంలో ఉన్న వారి బంధువు కమల గొడవ ఆపడానికి ప్రయత్నించగా అత్త పద్మతోపాటు కమలను గాయపర్చాడు. అంతటితో ఆగకుండా గూన పెంకతో కమల తలపై బాదడంతోపాటు పక్కనే ఉన్న బిందెతో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలైన కమల కింద పడడంతో స్థానికులు గమనించి బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చేర్చిన కొద్ది సేపటితో మృతి చెందిందని తెలిపారు. కాగా నిందితుడు మహేష్ గ్రామ సమీపంలో ఉన్న అడవిలోకి పారిపోగా తమకందిన సమాచారం మేరకు మహేష్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో తాళ్లగురిజాల ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

తోడేలు దాడిలో 11 గొర్రెలు మృతి

జన్నారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మురిమ డుగు గ్రామంలో సందవేణి రాజన్నకు చెందిన గొర్రెల మందపై గురువారం అర్ధరాత్రి తోడేలు దాడి చేయడంతో 11 గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు రాజన్న తెలిపిన వివరాల ప్రకారం అర్ధరాత్రి గొర్రెల అరుపులు వినిపించడంతో లేచి చూసేసరికి తోడేలు గొర్రెలపై దాడి చేస్తుంది. గట్టిగా కేకలు వేయడంతో పారిపోయిందని తెలిపారు. అప్పటికే 11 గొర్రెలు మృతిచెందాయన్నారు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నాడు.

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హౌజ్ అరెస్టు అమానుషం

జన్నారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించ డానికి అవకాశం ఇవ్వకుండా మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను హౌజ్ అరెస్టు చేయడం అమానుషమని బీఆర్ఎస్ నాయకులు జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం జన్నారంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కుతున్నారన్నారు. సత్యం, ఫజల్‌ఖాన్, శ్రీనివాస్‌గౌడ్, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో వార్డు అధికారులు



- ఇకపై కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ప్రతివార్డుకు ఒక అధికారి
- క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పరిశీలన



కాగజ్‌నగర్ మున్సిపాల్టీ

కాగజ్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో ఇకపై ప్రజలకు వార్డు స్థాయిలో అధికారుల సేవలు అందనున్నాయి. వార్డు అధికారుల కేటాయింపుతో సంబంధిత వార్డులో జరిగే సంఘటనలు, పారిశుధ్య సమస్యలు, నిర్వహణ తదితర వాటిని వీరే చూసుకోనున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అభ్యర్థనలపై కూడా తక్షణ చర్యలు తీసుకునేందుకు చక్కటిమార్గం ఏర్పడనుంది. ప్రజా అవసరాలను గుర్తించి సమగ్ర విధానంతో, నిరంతరం ప్రజలతో మమేకమవుతూ పనిచేస్తూ వీరు సేవలు అందించనున్నారు. వివిధ సర్వేలు, జనన, మరణాలు తదితరాలపై కూడా వార్డు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సర్టిఫికేట్లను జారీ చేయనున్నారు. కాగజ్‌నగర్ పట్టణానికి 26మంది వార్డు అధికారులను నియమించారు. నూతన నియామక పత్రాలను నాలుగు రోజుల క్రితం పెద్దపల్లిలో నిర్వహించిన కాంగ్రెస్‌పాలన విజయోత్సవ సంబరాల్లో సీఎం చేతుల మీదుగా అందజేశారు. ప్రస్తుతం ఒక వైపు కౌన్సిలర్, మరో వైపు వార్డు అధికారి సమన్వయంతో వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాల్టీలో 20వార్డులు ఉండగా, వీఆర్వో వ్యవస్థను తొలగించిన తర్వాత జిల్లాలో పని చేసిన వీఆర్వోలలో 20మందిని ఆసిఫాబాద్ మున్సిపాల్టీకి వార్డు అధికారులుగా నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం వార్డు అధికారుల నూతన నియామకాలు కేవలం కాగజ్‌నగర్ మున్సిపాల్టీలోనే చేపట్టడం విశేషం.

కొత్తగా 26మంది నియామకం..

2022లో నిర్వహించిన గ్రూపు-4 పరీక్ష ద్వారా వార్డు అధికారులను ఎంపిక చేశారు. నాలుగు రోజుల క్రితం వీరిందరికి నియామకపత్రాలను అందించారు. కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో 30వార్డులుండగా, మూడేళ్ల క్రితం రెవెన్యూ వ్యవస్థలో వీఆర్వో వ్యవస్థను అప్పటి ప్రభుత్వం తొలగించి వీఆర్వోలను ఇతరశాఖలకు బదిలీ చేశారు. అప్పుడే కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో నలుగురిని సర్దుబాటు చేశారు. ప్రస్తుతం 26పోస్టులు ఇంకా ఖాళీగా ఉన్నాయి. వీటిని కొత్త వారితో భర్తీ చేసి నియామకపత్రాలను అందజేశారు. వార్డు అధికారులు నియామక పూర్తికావటం, త్వరలోనే వీరిసేవలు అందనుండటంతో వార్డు ప్రజలకు, అధికారుల మధ్య పనుల విషయంలో పారదర్శకత నెలకొననుంది. వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు గతంలో నేరుగా మున్సిపాల్టీ కార్యాలయ అధికారులకు వద్దకు వెళ్లి ఫిర్యాదులు చేయాల్సి ఉండేది. కానీ ప్రస్తుతం వార్డు అధికారుల నియామకంతో ఆ సమస్య తీరనుంది.

ప్రజలకు మరింత పాలవంతమైన సేవలు..



వార్డు అధికారుల నియామకాల ప్రక్రియ పూర్తి అయింది. వారంతా కొత్తగా విధుల్లోకి రావాల్సి ఉంది. వీరు చేరితే కాగజ్‌నగర మున్సిపాల్టీకి కొత్త శోభ రానుంది. వార్డుల్లో నెలకొన్న సమస్యలు నేరుగా చూసుకునేందుకు వార్డు అధికారి బాధ్యత ఉంటుంది. కౌన్సిలర్‌తోపాటు వార్డు అధికారి సమన్వయంతో అభివృద్ధి చేసేందుకు చక్కటి మార్గం కలగనుంది.

-అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్

న్యూస్ బాక్స్

ఇంద్రవెల్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సిర్పూర్(యు), డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లిలో ఈనెల9న నిర్వహించతలపెట్టిన చలో ఇంద్రవెల్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ కోయ పుణ్యం రాష్ట్రకార్యదర్శి ఆత్రం ఆనంద్‌రావ్ కోరారు. ఈ సందర్భంగా కుమరం భీం విగ్రహం వద్ద వారు జైఆదివాసీ అటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆత్రం ఆనంద్ రావ్ మాట్లాడుతూ ఆదివాసుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల9న చలో ఇంద్రవెల్లి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, దీనికి వేలాదిగా తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కుంర భీంరావ్, నాగోరావ్, సెడ్మకీ బాపూరావ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): : జిల్లా కేంద్రం లోని ఆదర్శపాఠశాలకు చెందిన రామగిరి తనయ్ ఈనెల3 నుంచి 5వరకు మహారాష్ట్ర పేగాన్‌లో జరిగే జాతీయస్థాయి అత్యపత్య పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ తిరుపతి, కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

యోగా గురువుకు సన్మానం

కాగజ్‌నగర్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో పతంజలి యోగాపీఠ్ కేంద్రంలో శుక్రవారం యోగా గురువు కొంగ సత్యనారాయణను సభ్యులు ఘనంగా సన్మానించారు. కొన్ని రోజులుగా యోగాపై శిక్షణను పట్టణవాసులకు అందించారు. కార్యక్రమంలో యోగాకేంద్రం నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ వర్ధంతి



కాగజ్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలో, మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు దినకర్, టీకానంద్, కిరణ్, వెంకటేష్, అభి, అంజి, కార్తీక్, రోహిత్, స్వామి పాల్గొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే హరీష్‌బాబు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశాడన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో అంబేద్కర్ చిత్రపటానికి బీజేపీ జిల్లాఅధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయసాధన కోసం అంతా కృషిచేయాలన్నారు. తెలంగాణ మాలమహాసభ, బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో కూడా వర్ధంతిని నిర్వహించారు. వివిధసంఘాల ఆధ్వర్యంలో బుద్ధవిహార్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, రిటైర్డ్‌ఎంప్లాయిస్ యూనియన్ అధ్య క్షుడు జయదేవ్ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్, ఏతం ప్రేమ్‌కుమార్, కోనేరు చారిటుబల్ ట్రస్టు చైర్మన్ కోనేరువంశీ, ఆయాసంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలకేంద్రంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్‌సంఘం నాయకులు జైరాం, విలాస్, ప్రసాద్, హంసరాజ్, పాండుజీ, భక్తరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండలకేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి నాయ కులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. జైనూర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే నేడు రిజర్వేషన్లు, వివిధ పదవులు అనుభవిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీగ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్‌రావ్, సహకారచైర్మన్ కొడప హన్నుపటేల్, మేస్రాం అంబాజీరావ్, మాజీసర్పంచులు మడావిభీంరావ్, మేస్రాం భూపతి, కనక గంగారాం తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): అంబేద్కర్ సేవలు మరువ లేనివని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగ్వంత్‌రావ్ అన్నారు. బస్టాండ్ కూడలీలో శుక్రవారం ఆదివాసులు, దళితులు అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు ఆర్పించారు. కార్యక్రమంలో అర్కనాగోరావ్, కుంర భీరావ్, కాంబ్లే భావురావ్, మాజీ సర్పంచ్ మేస్రాం భూపతి తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండలకేంద్రంలోని కరుణా బౌద్ధ విహార్‌లో శుక్రవారం అంబేద్కర్ మెమోరియల్ అసోషియేషన్, కరుణా మహిళామండలి, అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలోసభ్యులు ఉత్తం, మిలింద్, భగవాన్, ధురుబాయి పాల్గొన్నారు.

పెంచికలపేట: మండలకేంద్రంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంలో అంబేద్కర్ సంఘంనాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జోగేందర్, అంబేద్కర్‌సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.

బెజ్జూరు: మండల కేంద్రంతోపాటు మర్తిడి, సలుగుపల్లి, సులుగుపల్లి, లుంబినీనగర్, తదితర గ్రామాల్లో అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం లో నాయకులు వాసుదేవ్, రవి, తిరుపతి, సకారాం, తిరుపతి, శంకర్, సుగుణ, అమృత తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు


బెజ్జూరులో నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు


వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు



రియాజ్ అహ్మద్‌పై దాడి సరికాదు

శ్రీరాంపూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తమ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రియాజ్‌అహ్మద్‌పై ఆర్‌జీ-1ఏరియాకు చెందిన ఏఐటీయూసీ నాయకుడు మడ్డి ఎల్లయ్యదాడికి యత్నిం చడం సరికాదని హెచ్ఎంఎస్ ఏరియా కార్యదర్శి వి అనిల్ రెడ్డి అన్నారు. ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో జరిగిన ఘటనను ఖండిస్తూ శ్రీరాంపూర్ ఏరియాలో పలువురు హెచ్ ఎంఎస్ యూనియన్ నాయకలుఉ గనులపై నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా అనిల్‌రెడ్డి మాట్లాడుతూ, ఆర్‌జీ-1 ఏరియాకు చెందిన మహిళా కార్మికురాలి తల పగులగొట్టి, ఎస్సీ, ఎస్టీ కేసులో మడ్డి ఎల్లయ్య 13 రోజులు రిమాండ్‌కు వెళ్లాడని అన్నారు. పదిరోజులు కూడా కాకముందే మళ్లీ తన రౌడీయిజాన్ని మొదలుపెట్టాడని ఆరోపించారు. రియాజ్ అహ్మద్‌ను జీఎం కార్యాలయంలో అధికారుల సమక్షంలోనే పట్టపగలే దుర్భాష లాడుతూ, దాడికి యత్నించడాన్ని అన్ని యూనియన్ల నాయకులు ఖండిం చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్ర ప్రసాద్, చెవుల శ్రీనివాస్, తుల అనిల్, రణదీప్, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కార్మికులు

గైర్హాజరుతో ఉద్యోగాలు కోల్పోకండి


గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మందమర్రిటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగులు గైర్హాజరై ఉద్యోగాలు కోల్పోవద్దని ఎస్వోటూ జీఎం విజయ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం సీఈఆర్ క్లబ్‌లో గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో చాలా మంది విధులకు గైర్హాజరవుతున్నారని అన్నారు. వంద మస్టర్లు చేయకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామనే విషయాన్ని గమనించాలన్నారు. పని ప్రదేశాల వద్ద సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. గైర్హాజరు కాకుండా సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. 250మంది గైర్హాజరు ఉద్యోగులు హాజరుకావాల్సి ఉండగా వందమంది వారి కుటుంబీ లతో హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, పీఎం శ్యాంసుందర్, ఏరియా ఆసుపత్రి వైద్యులు విజయవాణి, డీవైపీఎం విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ, యూబీఐ, కెనరా బ్యాంకు ఖాతాలు తీసుకోవాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకుల్లో ఖాతాలు పొందాలని డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ, యూబీఐ, కెనరా బ్యాంకుల్లో ఖాతా ఉన్నట్ల యితే ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ఆయా బ్యాంకులతో ఒప్పందం చేసుకుందన్నారు. ఏరియాకు చెందిన 319 మంది ఇంకా ఆయాబ్యాంకుల్లో ఖాతా తీసుకోవాల్సి ఉందన్నారు. ఏదైనా కారణం వలన వారు ప్రస్తుత బ్యాంకు నుంచి పైన పేర్కొన్న బ్యాంకులకు మార్చుకోలేకపోతే గని, విభాగం అధికారులకు లేఖ రాసి ఇవ్వాలని కోరారు.

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు

మందమర్రిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి పైరవీలు లేకుండా పారదర్శకంగా ఎస్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించామని ఎస్వోటూ జీఎం విజయప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలకు సంబంధించి 99క్వార్టర్లకు 130మంది ఉద్యోగులు దరఖాస్తులుచేసుకోగా వారికికౌన్సిలింగ్ నిర్వహించారు. వారుమాట్లా డుతూ సీనియారిటీప్రకారం 29మందిఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించామన్నారు. కార్య క్రమంలో ఐఈడీరాజన్న, డీవైపీఎం మైత్రేయబంధు, పీఏ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారిని కలిసిన జీఎం

శ్రీరాంపూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా ఫారెస్ట్ అధికారి శివ్‌ఆశిశ్ సింగ్‌ను శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వి సూర్యనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏరియాలోని సింగరేణిసంస్థ ఆధీనంలో ఉన్న అటవీ భూములపై వారు చర్చించారు. కార్యక్రమంలో ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

రక్షణకే మొదటి ప్రాధాన్యత

మందమర్రిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో రక్షణకే మొదటి ప్రాధాన్యత అనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. శుక్రవారం జీఎం కాన్ఫరెన్స్ హాలులో సేఫ్టీ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 9నుంచి 19వరకు ఏరియా 59వ భద్రత పక్షోత్సవాలు జరుగుతాయన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ఆయావిభాగాలకు సంబం ధించిన రక్షణ చర్యలు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ప్రాజెక్టు అధికారులు, ఏజెంట్లు, గని మేనేజర్, ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే పనులు ప్రారంభం

5వ పేజీ తరువాయి

ఇప్పటి వరకు రూ.31 కోట్ల చెల్లింపులు జరుగగా, మరో రూ.15 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది.

పరిహారంపై పెదవివిరుపు...

ఇదిలా ఉండగా రహదారి కింద ముంపునకు గురయ్యే భూములకు ప్రభుత్వపరంగా చెల్లించే పరిహారంపై కొం దరు రైతులు పెదవి విరుస్తున్నారు. బహిరంగ ధర ఎక రాకు కనీసం రూ.40 లక్షలు పలుకుతుండగా, అధికా రులు నిర్ణయించిన మేరకు అందులో సగం మాత్రమే వస్తుందనే నిరాశలో ఉన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల కింద కోల్పోతున్న భూముల మాదిరిగా మార్కెట్ విలు వకు మూడు రెట్లు పరిహారం చెల్లిస్తే బాగుండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు ముంపు రైతులు కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజే శారు. అయినప్పటికీ పరిహారం విషయంలో ఎలాంటి పురోగతి లేదని రైతులు చెబుతున్నారు.

పెరుగుతున్న భూముల ధరలు...

జైపూర్ మండలం మీదుగా జాతీయ రహదారి వెళ్తుండటంతో సమీపంలోని భూముల ధరలు పెరి గాయి. అధికారులు సేకరించిన సమయంలో ఉన్న ధరల కంటే ప్రస్తుతం రెండింతలు పెరిగినట్లు తెలుస్తోంది. దీంతో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న భూముల రైతులు ఆనందంలో ఉన్నారు. భూముల ధరలు పెరగ డంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటోంది. ప్లాట్ల వెంచర్లు ఏర్పాటు చేస్తుండ టంతో సమీపంలోని భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఎకరా రూ.20 లక్షలు పలికే చోట ప్రస్తుతం రూ.50 లక్షల వరకు ధర పలుకు తున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

బెల్లంపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాల బాలికల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల్లో పట్టణంలోని ఇంక్లైన్ 2 జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పి.కార్తీక్, జి.శిఖాలు జోనల్ స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరపున ఈ నెల 7 నుంచి ఆర్మూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు దేవానందం, పీఈటీ ఎండీ చాంద్‌పాషాలు తెలిపారు. విద్యార్థులను సన్మానించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులకు సైన్స్ కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ప్రిన్సిపాల్ అయూబ్

మంచిర్యాల అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ స్పేస్ సొసైటీ అమెరికా సంస్థ నాసా అనుబంధంతో యేటా అంతరిక్షంపై సైన్స్ ప్రాజెక్టులను ఆహ్వానిస్తారు. అందులో భాగంగా పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల లక్ష్మీనగర్ బ్రాంచ్‌కు చెందిన 25 మంది విద్యార్థులు భూమిపై ఉనికి లేనప్పుడు అంతరిక్షంలో ఎలా జీవించాలనే అంశంపై 3 ప్రాజెక్టులను సిద్ధం చేశారు. నిర్వాహకులు పంపిన సైన్స్ కిట్లను శుక్రవారం జిల్లా సైన్స్ అధికారి మధుబాబు చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్లు శ్రీవిద్యలు అభినందించారు. మంచిర్యాల జోన్ ఏజీఎం అరవింద్, తెలంగాణ అకాడమిక్స్ హెడ్ జయరాజ్, ప్రిన్సిపాల్ అయూబ్, జోన్ కోఆర్డినేటర్ నాగరాజు, డీన్ ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

మందమర్రిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఊరు మందమర్రిలోని పేదలకు శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మా ఊరు స్వచ్ఛంద సేవా సంఘం నాయకులు దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇబ్రహీం మాట్లాడుతూ మహనీయుడు అంబేద్కర్ వర్ధంతి రోజు పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేణుగానంలో రాణిస్తున్న ఎస్టీపీపీ ఉద్యోగి

- కోలిండియా పోటీల్లో పతకాలు కైవసం
- పలు ఆలయాల్లో ప్రదర్శనలు



కోలిండియాలో జరిగిన కల్చరల్ ప్రోగ్రాంలో వేణుగానం చేస్తున్న రవీంద్రకుమార్

జైపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తూనే తనకు ఇష్టమైన వేణుగానంలో రాణిస్తున్నాడు రవీంద్రకుమార్. ఇటీవల సింగరేణి స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటి కోలిండియా పోటీలకు ఎంపికయ్యాడు. రవీంద్ర కుమార్ ప్రస్తుతం ఎస్టీపీపీలో ఫోర్‌మన్ ఎలక్ట్రికల్ ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

కోలిండియా స్థాయిలో ప్రదర్శనలు..

2002 నుంచి సింగరేణిలో నిర్వహించే సాంస్కృతిక పోటీల్లో పాల్గొంటున్నాడు. కోలిండియాలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించాడు. 14సార్లు కోలిండియా పోటీల్లో పాల్గొని రెండు సార్లు ద్వితీయ, ఒకసారి తృతీ య బహుమతి అందుకున్నారు. ఈనెలలో కలకత్తాలో నిర్వహించే పోటీలకు సింగరేణి తరుపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. గోదావరి కళాసంఘాల సమాఖ్య ద్వారా సంగీత కళాజ్యోతి పురస్కారాన్ని అప్పటి రామగుండం ఎమ్మెల్యే సోమారం సత్యనారాయణ చేతుల మీదు గా అందుకున్నారు. ఎస్టీపీపీలో తారాఆర్ట్స్ అకాడమీ ఆధ్వ ర్యంలో పలువురు సినీ ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే తిరుమల తిరు పతి, యాదగిరి గుట్టలో ప్రదర్శనలు ఇస్తున్నారు. యేటా వేములవాడలో నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాలు, ధర్మపురిలో బ్రహ్మోత్సవాల్లో వేణుగానాన్ని వినిపిస్తున్నారు.



వేణుగానం చేస్తున్న రవీంద్రకుమార్

తండ్రి బాటలో కూతురు...

శాస్త్రీయ కళలకు జీవం పోయాలనే తపనతో కుమార్తె శ్రీనిధి, కుమారుడు శ్రీవంశీలకు వయోలిన్‌లో ప్రోత్సహించారు. ఎస్టీపీపీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించే కూతురు శ్రీనిధి సైతం కర్ణాటక సంగీతంలో శిక్షణ తీసుకుని వోకల్ విభాగంలో సింగరేణి తరుపున తండ్రితో కలిసి డిసెంబరులో జరిగే కోలిండి యా పోటీల్లో ప్రదర్శన ఇవ్వనుంది.

న్యూస్ బాక్స్

బీడీ శర్మ వర్ధంతి

కాసిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆత్మబంధువు, ఐఏఎస్ ఆఫీసర్ బీడీ శర్మ వర్ధంతిని దేవాపూర్‌లో శుక్రవారం ఆదివాసీ సంఘాల నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతంలో కలెక్టర్‌గా పనిచేస్తూ ఆదివాసీల హక్కుల కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీంరావు, ఆదివాసీ కొలాం సంఘం జిల్లా కన్వీనర్ ఆత్రం మహేష్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య, నాయకులు రెడ్డి లక్ష్మణ్, సిడాం శంకర్, పోశం, కోవ లింగు, భగవంతరావు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

హాజీపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్కలలో ఏడీఏ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి నమూనాలను సేకరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని భూసార పరీక్షల పథకంలో భాగంగా మండలం నుంచి 4106 మట్టి నమూనాలను సేకరించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సేకరించిన మట్టి నమూనాలను ఆదిలాబాద్‌లోని మట్టి పరీక్ష కేంద్రానికి పంపించి ఫలితాలను రైతులకు ఇవ్వాలన్నారు. ఇందుకు అనుగుణంగా ఎరువులను రైతులకు సిఫార్సు చేయాలని సూచించారు. ఏవో కృష్ణ, ఏఈవోలు కొమురయ్య, మౌనిక, ప్రసన్న , రైతులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన

చెన్నూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట సమీపంలోని అంబేద్కర్ ఏకో పార్కులో శుక్రవారం అటవీ శాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు వన్య ప్రాణుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సీతాకోక చిలుకలు వాటి పేర్లు, అలాగే పలు రకాల పక్షులు, మొక్కల గురించి తెలియజేశారు. అకిరామియావాకి అడవి గురించి వివరించారు. ఎఫ్‌ఆర్‌వో శివకుమార్, డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్, సెక్షన్ అధికారులు అంజయ్య,రాకేష్, ఎఫ్‌బీవోలో జ్యోతి, సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

భీమారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం మద్దికల్, అంకుశాపూర్, తాళ్లగూడెంలోని ప్రజలకు అటవీ సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులు, అడవిని అందరూ సంరక్షించాలన్నారు. వేటగాళ్లు విద్యుత్ వైర్లు అమర్చి జంతువులను వేటాడితే కఠినచర్యలు తీసుకొంటామన్నారు. ఎఫ్‌ఎస్‌వోలు సతీష్, ఎఫ్‌బీవోలు అనిత, శివకుమార్, బానేష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఐటీఐ భవన నిర్మాణ పనులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్ (ఫైల్)

నస్పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లో నిర్మిస్తున్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ, అధునాతన సాంకేతిక కేంద్రం (ఏటీసీ) నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మార్చి నాటికి పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు కొనసాగిస్తున్నారు. నస్పూర్ శివారులోని సర్వే నంబరు 119లో రెండు ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. పట్టణంలోని ప్రగతినగర్ కాలనీలో సుమారు రూ.4 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. గత నెల 10న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్‌లు శంకుస్థాపన చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇంటర్ స్థాయిలో అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలను అధునాతన సాంకేతిక కేంద్రాలు (ఏటీసీ)గా మార్చి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టింది. నిర్మాణం, టెక్నాలజీ రంగాలకు అనుగుణంగా మరిన్నీ కొత్త కోర్సులను ప్రవేశపెట్టనుంది.

కొత్త కోర్సులు ఇవే...

సింగరేణి హైస్కూల్ పాత భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ ఐటీఐలో ఐదు కోర్సులు ఎలక్ట్రీషన్, వెల్డర్, ఫిట్టర్, సోలార్ టెక్నీషియన్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రో గ్రామింగ్ అసిస్టెంట్ (కోపా)ల్లో 140 మంది విద్యా ర్థులు విద్యనభ్యసిస్తు న్నారు. కొత్త కోర్సులు అందుబాటు లోకి వస్తుండడంతో సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెకానిక్, ఇండస్ట్రియల్ రొబొటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటో మిషన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానికల్), ఆర్టీషియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూ తదితర కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఇక్కడే ఐటీఐ కళాశాల భవనం కూడా నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు అయితే వర్క్‌షాప్, కళాశాల భవనం రెండు ఒకే క్యాంపస్‌లో ఉంటాయి.

వచ్చే ఏడాది అడ్మిషన్లు

టి. సుజాత- ఐటీఐ ప్రిన్సిపాల్

భవనం పూర్తయితే కొత్త కోర్సులకు వచ్చే ఏడాదిలో అడ్మిషన్లు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వర్క్‌షాప్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కళాశాల భవనం కావాలని అడిగాం. ప్రభుత్వం పరిశీలనలో ఉన్నది. ప్రభుత్వం నుంచి నిధులు వస్తే భవన నిర్మాణం కూడా జరుగుతుంది. కళాశాల భవనం వస్తే రెండు కూడా ఒకే క్యాంపస్‌లో ఉంటాయి.



పిల్లర్ల పనులను చూస్తున్న అధికారులు

పంటలు అడవి పందుల పాలు



తాండూర్‌లో అడవి పందుల దాడిలో ధ్వంసమైన వరి పంట



కాసిపేటలో అడవి పందుల దాడిలో ధ్వంసమైన వరి పంట

- యేటా పంట చేతికి వచ్చిన సమయంలో దాడులు
- వందల ఎకరాల్లో దెబ్బతింటున్న వైనం
- పంటలను కాపాడుకునేందుకు రైతుల పాట్లు

బెల్లంపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అడవి పందులు రైతులకు కంటి మీద కనుకు లేకుండా చేస్తున్నాయి. అటవీ ప్రాంతాల నుంచి గుంపులు గుంపులుగా వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం వరి కోత దశలో ఉండగా పత్తి సైతం చేతికి వచ్చింది. ఈ సమయంలో పందులు పంట పొలాల్లోకి వస్తూ పంటలను ధ్వంసం చేస్తుండడంతో కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

యేటా వందల ఎకరాల్లో నష్టం...

యేటా పంట చేతికి వచ్చే సమయంలో పంటలపై అడవి పందులు దాడులు చేస్తూ రైతులను నష్టపరుస్తున్నాయి. రాత్రివేళలో పంటలను ధ్వంసం చేస్తున్నాయి. జిల్లాలోని అటవీ ప్రాంతా లకు దగ్గరగా ఉన్న పత్తి చేన్లలో, పొలాల్లో కూరగాయల పంటలకు అడవి పందుల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ సీజన్‌లో ఇప్పటికే వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవి పందుల దాడిలో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ఎకరానికి రూ. 7,500చొప్పున పరిహారం అందిస్తున్నప్పటికీ రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో అధికారులకు దరఖాస్తులు చేసుకోవడం లేదు. జిల్లాలో ఎక్కువగా కౌలు రైతులు ఉండడంతో నష్టపరిహారం వర్తించని పరిస్థితి నెలకొంటుంది. వివిధ కారణాలతో నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో నష్టపోతే పరిహారం రావడం లేదు.

పంటలను కాపాడుకునేందుకు రైతుల పాట్లు

అడవి పందుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. కొందరు రైతులు బాణాసంచా కాలుస్తూ కాప లాగా ఉంటుండగా మరి కొందరు పొలాల్లో మనుషులు ఉన్నట్లుగా బొమ్మలను ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కువ మంది పాత చీరలను చుట్టూ కడుతున్నారు. ఇలా రైతులు తమ పంట పొలాలను కాపాడుకునేందుకు నానాపాట్లు పడు తున్నారు. అడవిపందులు దాడులు చేస్తుండడంతో యేటా పదుల సంఖ్యలో రైతులు గాయపడుతున్నారు.

పంటలను నష్టపరుస్తున్నాయి.



పంట పొలాలపై అడవి పందులు దాడి చేసి యేటా నష్టపరుస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు నానాపాట్లు పడుతున్నాం. అడవి పందులు గుంపులుగా వస్తుండడంతో వాటిని గమనించి టపాసులు కాలుస్తూ శబ్దాలు చేస్తూ పంటలను కాపాడుకుంటున్నాం. పంట చేతికి అందే సమయంలో పంటలను తినేసి కాళ్లతో తొక్కయడంతో దెబ్బతింటుంది.

- సంతోష్ , రైతు

నష్టపరిహారం చెల్లించాలి..



అడవి పందుల దాడిలో మొక్కజొన్న, కూరగాయలు, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. యేటా పంటలపై దాడి చేస్తుండడంతో నష్టాల పాలవుతున్నారు. కౌలు రైతులకు సైతం నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- సాబీర్‌హుస్సేన్ , రైతు, తాండూర్

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



పోలంపల్లి కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

చెన్నూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కిష్టంపేట, ఆస్నాద్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం అదనపు కలెక్టర్ మోతిలాల్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. తేమ శాతం, మట్టి గడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): పోలంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్ పరిశీలించారు. రైతులు దళారులను నమ్మిమోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు.

ఆటల పోటీలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వనజారెడ్డి

జైపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించనున్న ముఖ్యమంత్రి కప్ ఆటల పోటీలను విజయవంతం చేయాలని తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణలు పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో పీడీలు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, శ్రీధర్, ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పులి కోసం అధికారుల గాలింపు

కెరమెరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని నిశాని గ్రామంలో శుక్రవారం ఎఫ్ఆర్వో మజారోద్దీన్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది పులికోసం గాలించారు. గురువారం నిశాని గ్రామానికి చెందిన వడాయి పీతంబర్ అనే వ్యక్తికి చెందిన ఎద్దు పులిదాడిలో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎఫ్ఆర్వో పులికోసం గ్రామ పరిసర అటవీ ప్రాంతాల్లో గాలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుడికి అటవీశాఖ తరపున పరిహారం అందేలా చూస్తామన్నారు.

శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉద్యోగంలో అమలు పర్చాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శిక్షణలో నేర్చుకున్న అంశాలను వృత్తిలో అమలు చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లాలో నూతనంగా భర్తీ అయిన పోలీసు సిబ్బందికి జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో 15రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలు, వెహికల్ తనిఖీల్లో తీసుకోవాల్సిన మెలకువలు నేర్చుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. చెక్ పోస్టుల వద్ద డ్యూటీలు, వాహనాల తనిఖీలు, ఇతర విధుల నిర్వహణకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే పోలీసుసిబ్బందికి శారీరక దారుఢ్యం కోసం, మావోయిస్టు కదిలికలపై ప్రత్యేక నిఘాకోసం ఈశిక్షణ ఎంతో ఉపయోగుడుతుం దన్నారు. ఈశిక్షణను మరింత ఉల్లాసంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అర్డీ అడిమన్ పెద్దన్న, ఆర్ఐ ఎంటీవో అంజన్న, ఆర్ఎస్సైలు కిరణ్, సందీప్, రాజేష్, లవన్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరపకుండా అవగాహన కల్పించాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా కూడా బాల్యవివాహాలు జరగకుండా పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లాబాలల సంరక్షణ అధికారి మహేష్ అన్నారు. శుక్రవారం బాల్ రక్షాభవన్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి బాల్‌వివాహ్ ముక్త్ భారత్ లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రావణ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, జమున, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

రెబ్బెన, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన తాళ్లపల్లి ఝాన్సీ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. గతనెల స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో జరిగిన పోటీల్లో ఝాన్సీ అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. విద్యార్థిని ఎంపిక కావటం పట్ల వైస్‌ప్రిన్సిపాల్ ఎ.రజిత, స్వరూప తదితరులు అభినందించారు.



చేనేత కేంద్రంలో పని చేస్తున్న కార్మికుడు

చేనేతకు కావాలి చేయూత

చేనేత ఉత్పత్తులకు కరువవుతున్న ఆదరణ

- మూడునెలలుగా కార్మికులకు అందని చేనేత పెన్షన్
- దయనీయస్థితిలో కార్మికులు

కాగజ్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చేనేతకు ఆదరణ కరువవుతోంది. గతమెంతో ఆదరణ పొందినప్పటికీ వర్తమానంలో ఒక్కసారిగా చేనేత వస్త్రాలకు క్రేజీ తగ్గిపోయింది. దీంతో చేనేత కార్మికులు దయనీయ స్థితిలో కాలం వెల్లదీస్తున్నారు. చేనేత కేంద్రాల నిర్వహణ కష్టంగా మారింది. ఆదరణ లేక వీటి ఉత్పత్తి ఒక్కసారిగా తగ్గటంతో చేనేతకేంద్రాలు కుదేల య్యాయి. నెలకు 1500మీటర్ల ఖాదీ దుస్తులు తయారుచేసే కేంద్రాలు ఆదరణ లేక మూత బడ్డాయి. చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్ర త్యామ్నాయంగా దుప్పట్లు, బెడ్‌షీట్‌లు తయారీ చేసి అమ్ముతున్నారు. కాగజ్‌నగర్ పరిధిలో చేనేత సహకార సంఘం నడుస్తోంది. ఈ సంఘంలో 23మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికి సగటు నెలకు రూ.5వేల ఆదాయం దాటని స్థితి ఉంది. ఒక వైపు పెరుగుతున్న ధరలు మరోవైపు చాలీచాలని పీస్‌వర్క్ రేటుతో దయనీయంగా కాలం వెళ్లదీస్తున్నారు. అనారోగ్యం బారిన పడితే కనీసం మందులకు కూడా డబ్బులు సరిపోని పరిస్థితి. పరిస్థితిని గమ నించిన గత ప్రభుత్వం వీరికి రూ.2చేనేత పెన్షన్ మంజూరు చేసింది. మూడు నెలల నుంచి తమకు ఆ పెన్షన్ కూడా రావటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక కూలీ పని చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తాము తయారు చేసిన బెడ్ షీట్స్ దుప్పట్లు ప్రభుత్వ హాస్టళ్లలో వాడుతున్నట్టు తెలిపారు. చేనేత తయారీ కేంద్రంలో పనిచేసే కార్మికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు దుప్పట్లు తయారు చేస్తే ఒక్కొక్కరికి రూ.200కూడా గిట్టుబాటు కావటం లేదని కార్మికులు పేర్కొంటున్నారు. ఒకవైపు పెరుగుతున్న ధరలు, మరోవైపు చేనేత రంగం ఉత్పత్తులకు మార్కెట్‌లో ధర లేకపోవటంతో ఒక్కసారి సంక్షోభానికి దారి తీసింది. ఈ సంఘంలో తయారు చేసిన దుప్పట్లు, ఇతరత్రా అన్నీ కూడా గతంలో ఆప్కో ద్వారా కొనుగోలు చేసి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులకు సరఫరా చేసేవారు. ప్రభుత్వం కూడా ఇందులో పని చేసే కార్మికులకు ప్రత్యేకంగా క్వార్టర్లను కేటాయించింది. ఈ క్వార్టర్లు కనీసం నివాస యోగ్యంగా కూడా లేవు. కష్టాల కడలిలో కాలం వెళ్లదీస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని, పింఛన్ రెగ్యులర్‌గా వచ్చేలా చేయాలని కార్మికులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

-రాజమౌళి, కార్మికుడు, కాగజ్‌నగర్



నేను ఈ కేంద్రంలో రోజుకు మూడు బెడ్‌షీట్స్ తయారు చేస్తాను. రోజుకు రూ.300దాటని పరిస్థితి ఉంటుంది. వీటితో కుటుంబ పోషణ గడవదు. దయనీయ స్థితిలో కాలం వెళ్లదీస్తున్నాను. చేనేత పెన్షన్ కూడా రావటం లేదు. అధికారులు స్పందిందించి తమను ఆదుకోవాలి.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా..

-తాళ్ల రాజయ్య, కార్మికుడు, కాగజ్‌నగర్



మాకు గతంలో చేనేత పెన్షన్ వచ్చేది. మూడు నెలలుగా రావటం లేదు. పీస్ వర్క్ చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాను. ప్రభుత్వం స్పందించి తమకు ఆర్థికంగా సహాయం చేస్తే బాగుంటుంది. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

సమస్యలను పరిష్కరించాలి..

-కనకయ్య, కార్మికుడు, కాగజ్‌నగర్



చేనేత కేంద్రంలో కూలీలు పీస్‌వర్క్ చేస్తున్నప్పటికీ జీతాలు సరిపోవడం లేదు. జీతాలు పెంచితే తమకు కాస్త ఊరట లభిస్తుంది. ఈ విషయంలో అధికారులు, నాయకులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలి. చేనేత పెన్షన్ కూడా నిలిచిపోయింది. అది వచ్చేలా చూడాలి.

ఆసిఫాబాద్‌లో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్‌పట్టణంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. తుఫాన్ ప్రభావంతో ఉదయంనుంచి ఆకాశం మేఘావృతం కాగా సాయంత్రం వర్షంకురిసింది. తుఫాన్ ప్రభావంతో చలితీవ్రత తగ్గ ముఖం పట్టింది.

ఈటపల్లిలో కార్డన్ సెర్చ్

దహెగాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈటపల్లిలో శుక్రవారం ఎస్సై రాజు ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలని, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. నేరాల అదుపు కోసమే కార్డన్‌సెర్చ్‌నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్థల పరిశీలన

పెంచికలపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంట్లపేట గ్రామంలో నూతనంగా మంజూరైన అంగన్‌వాడీ కేంద్ర భవనం కోసం శుక్రవారం తహసీల్దార్ వెంకటేశ్వరరావు స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్నభూమిని పరిశీలించారు. నాయకులు చంద్రమౌళి, తదితరులున్నారు.

నేటి నుంచి సీఎం కప్ పోటీలు

వాంకిడి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గ్రామపంచాయతీస్థాయి సీఎంకప్ క్రీడాపోటీలు శని, ఆదివారల్లో నిర్వహిస్తామని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రియాజ్‌అలీ, ఎంఈవో చైతన్య కుమార్ తెలిపారు. సబ్‌జూనియర్ విభాగంలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా నిర్వహిస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రదర్శన

వాంకిడి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, వార్డుసభ్యుల ఎన్నికల కోసం మండలంలోని పోలింగ్‌కేంద్రాల ముసా యిదా జాబితాను అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం ప్రదర్శించినట్లు ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు. జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలున్నట్లయితే ఈనెల 7నుంచి 12వ తేదీ వరకు రాతపూర్వకంగా గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా ఎంపీడీవో కార్యాలయంలో లేదా జిల్లాపంచాయతీ అధికారి కార్యాలయంలో తెలియజేయవచ్చన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

కౌటాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా నిర్మిస్తున్న 132/33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న పనులను త్వరగా పూర్తిచేయాలని ట్రాన్స్‌కోఎస్ఈ వెంకటేశ్వరరావు, టీఎస్ఎన్పీడీసీఎల్ డీఈ నాగరాజు అన్నారు. శుక్రవారం నాలుగు మండలాలకు మెరుగైన విద్యుత్‌సరఫరా కోసం కౌటాల మండలకేంద్రంలో నిర్మిస్తున్న 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.55కోట్లతో చేపడుతున్న సబ్‌స్టేషన్ నుంచి కౌటాల, సిర్పూర్(టి), బెజ్జూరు, చింతలమానేపల్లి మండలాలకు నిరంతరం విద్యుత్‌సరఫరా చేయనున్నట్లు తెలిపారు. పనులు వేగవంతంగా చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

రెబ్బెన, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లో శుక్రవారం రెబ్బెన మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌తోపాటు పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా గంగాపూర్‌లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దశలవారీగా సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్సీ తెలిపినట్టు మాజీ ఎంపీటీసీ పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సిర్పూర్(టి) ఆశ్రమ పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

చింతలమానేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారంగా సంబంధిత రైస్‌మిల్లులకు తరలించాలని తెలిపారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.500బోనస్ అందిస్తామన్నారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యంను వేర్వేరుగా కొనుగోలు చేసి నిలువచేసే సంచులపై వేర్వేరు గుర్తులు ఉంచాలని తెలిపారు. రైతులు ఎండిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సమగ్ర కుటుంబసర్వే ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి బిక్కు, సహకార రిజిస్ట్రార్‌రబ్బానీ, తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీవో ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి..

సిర్పూర్(టి): విద్యార్థులకు మెనూప్రకారం భోజనం పెట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం పెట్టాలన్నారు. ఆయనవెంట సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు. లోనవెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో అదనపు కలెక్టర్ దీపక్‌తివారి మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం మాథ్యమెటిక్స్‌పై పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధిం చేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయనవెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.

కాగజ్‌నగర్ డివిజన్‌లో రెండు పులులు

- రాష్ట్ర పీసీసీఎఫ్ చీఫ్ ఆర్‌ఎమ్ డోబ్రియాల్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పీసీసీఎఫ్ చీఫ్ డోబ్రియాల్

సిర్పూర్(టి), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ డివిజన్‌లో రెండు పులులు తిరుగుతున్నాయని తెలంగాణ పీసీసీఎఫ్(ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్‌ఫారెస్ట్) చీఫ్ ఆర్ ఎమ్ డోబ్రియాల్ అన్నారు. శుక్రవారం తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దులోగల సిర్పూర్(టి)మండలంలోని హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి సరిహద్దులో పులలు సంరక్షణ, మనుషల ప్రాణరక్షణ తదితర అంశాలపై మహారాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు అనుసరిస్తున్న విధివిధానాలపై కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడోబా పులల సంరక్షణ అభయారణ్యంలో త్వరలో పర్యటిస్తామని అన్నారు. డివిజన్‌లో తిరిగే పులులు పదిరోజులక్రితం కాగజ్‌నగర్ మండలంలోని నజ్రుల్‌నగర్‌లో ఓ మహిళను హతమార్చడం, సిర్పూర్(టి) మండలం దుబ్బగూడలో సురేష్ అనేవ్యక్తిని గాయపర్చడం చేసిందన్నారు. ఇదే క్రమంలో మహారాష్ట్ర ప్రభుత్వం, అటవీ శాఖాధికారులు అనుసరిస్తున్న విధానాలు, పులుల కదిలికలు, వాటి సంతానోత్పత్తికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. తాము రెండు రోజుల్లో తడోబా అభయారణ్యంలో తప్పకుండా పర్యటిస్తామన్నారు. అనంతరం మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లా డీఎఫ్‌వో అవదుత్‌వార్, దాబా ఎఫ్ఆర్వో గౌడ్‌కార్‌తో అక్కడి వన్యప్రాణుల సంరక్షణపై చర్చించారు. సిర్పూర్(టి)రేంజ్ పరిధిలోని ఇటిక్యాలపహాడ్ గ్రామంలో అటవీశాఖ నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఏపుగా ఎదిగే విధంగా సంరక్షించాలన్నారు. అలాగే చీలపల్లి, మెట్‌పల్లి, రావన్‌పల్లి గ్రామాల్లో పర్యటించి పులి కదిలికలపై భాగంగా పులిఅడుగులను గుర్తించారు. సిర్పూర్(టి) రేంజ్‌లోని వెంపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన టవర్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా అటవీశాఖాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయనవెంట రాష్ట్ర వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ చైర్మన్ ఏలుసింగ్ మేరు, ఎఫ్‌డీవో నీరజ్‌కుమార్ టిబ్రెవాల్, కాగజ్‌నగర్ డీఎఫ్‌వో శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- ఎమ్మెల్యే హరీష్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏడాది కాంగ్రెస్ పాలనలో సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించటానికి తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధి విషయంలో చర్చ ఎక్కడ పెట్టినా కూడా తాను వస్తానని, తేదీ, సమయం, నిర్ణయించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కేంద్రనిధుల ద్వారానే జరుగుతోందన్నారు. వాంకిడి హాస్టల్‌లో విద్యార్థిని చనిపోయితే తాను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క రాజీనామా చేయాలని పేర్కొనటం సరైనదేనన్నారు. కాంగ్రెస్ నాయకులు తనపై అవాకులు, చెవాకులు పేలటం మాని ప్రజల సంక్షేమ, అభివృద్ధిపై దృష్టిసారించాలని హితవు పలికారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి దోని శ్రీశైలం, మాజీఎంపీపీ కొప్పుల శంకర్, దూగుంట రాజన్న, దుర్గంకారు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థిని మనోజ్ఞను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈనెల7నుంచి 12వరకు నిర్వహించనున్న బాలికల కబడ్డీపోటీలకు ఆసిఫాబాద్ పట్టణంలోని సేంట్‌మేరీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని మనోజ్ఞ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ లిబిస్, కరస్పాండెంట్ సిస్టర్ మాధ్యూ తెలిపారు. ఈ సందర్భంగా పీడీ రాకేష్, పీఈటీలు కిరణ్, అర్చనకుమారి, బద్రి, ఉపాధ్యాయులు థామస్ విద్యార్థినిని అభినందించారు.

ఈఎస్ఐ ఆసుపత్రిని పరిశీలించిన డిప్యూటీ డైరెక్టర్స్



ఆసుపత్రిలోని సమస్యపై అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ డైరెక్టర్

కాగజ్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిని కేంద్ర ఈఎస్ఐ ఆసుపత్రుల డిప్యూటీ డైరెక్టర్స్ బృంద సభ్యులు శుక్రవారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ఈఎస్ఐ భవనంపై అధ్యయనం చేశారు. వర్షాకాలంలో భవన స్థితిగతులపై వివరాలు సేకరించారు. అలాగే డిస్పెన్సరీని కూడా పరిశీలించారు. పట్టణంలోని పలుభవనాలను కూడా పరిశీంచారు. ఈ సందర్భంగా బృందసభ్యులు మాట్లాడుతూ ఈఎస్ఐ భవనం మార్చటమా..? లేక నూతన భవనం నిర్మించటమా..? అనేఅంశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. నివేదికను నేరుగా కేంద్ర ఈఎస్ఐ కార్పొరేషన్‌కు పంపించనున్నట్టు తెలిపారు. బృందంలో డిప్యూటీ డైరెక్టర్స్ రణధీర్, వేదప్రకాష్, మహేష్, జూనియర్‌ఇంజనీర్ రామయ్య, ఈఎస్ఐ డాక్టర్ జగన్, సిబ్బంది ఉన్నారు.

సీఆర్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దహెగాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా పీజీసీఆర్టీ 2పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో రిజ్వానా ఒకప్రకటనలో తెలిపారు. పీజీసీఆర్టీ గణితశాస్త్రం, జంతుశాస్త్రం పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఈనెల 9లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సిర్పూర్(యు): కేజీబీవీవిద్యాలయంలో సీఆర్టీల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సిర్పూర్(యు) కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వప్న శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. భౌతికశాస్త్రం, అంగ్లమాధ్యమంలో ఒక్కొక్కటి చొప్పు సీఆర్టీ అతిథిపోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పీజీఅర్హత కల్గినమహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

జైనూర్: మండలంలోని కేజీబీవీ కళాశాలలో ఇంగ్లీష్ సబ్జెక్టు బోధించుటకు అతిథి అధ్యాపక పోస్టుకు ఈనెల9లోగా దరఖాస్తు చేస్తులు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి ఎం సంధ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పీజీతోపాటు బీఈడీ అర్హతకల్గి ఉండాలని పూర్తిచేసిన దరఖాస్తులను మహిళా అభ్యర్థులు మాత్రమే కళాశాలలో నిర్ణీత గడవులోగా సమర్పించాలని ఆమె కోరారు.

సర్వే ఆన్‌లైన్ నమోదు త్వరగా పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్



ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

వాంకిడి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆన్‌లైన్ డేటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న సర్వే ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాత్రి పూట సర్వర్ ఫ్రీగా ఉంటున్నందన రాత్రి సైతం నమోదు చేయాలన్నారు. మిగిలిన సర్వే వివరాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీవో అజీమోద్దీన్ ఉన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలి

- సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి



మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసును రెగ్యులర్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మీ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎస్ఏలు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న రిలే దీక్షలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌లో విద్యాశాఖ సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలిపి న్యాయమైన డిమాండ్‌లను అధికారంలోకి రాగానే పరిష్కరి స్తామని హామి ఇచ్చారని అన్నారు. కానీ నేటికి అమలు చేయడం లేదన్నారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు నగేష్, పవన్, సంతోష్, సందీప్, వెంకటరమణ, మహేష్, దేవేందర్, సత్యనారాయణ, రమేష్, రాజేష్, రాజ్‌కుమార్, తిరుపతి, ఆనంద్, శృతిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లో గుబులు పుట్టిస్తున్న మబ్బులు



ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు

దహెగాం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మబ్బులు అన్నదాతల్లో గుబులు పుట్టిస్తున్నాయి. శుక్రవారం తుఫాన్ ప్రభావంతో ఆకాశం మేఘావృతం కావడంతోపాటు స్వల్పంగా చిరుజల్లులు పడడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే పొలాల్లో ఉన్నవరితో పాటు కోసి ఉంచిన ధాన్యంను కాపాడుకోవడానికి పడరానిపాట్లు పడుతున్నారు. ధాన్యపు రాశులపై టార్పాలిన్ కవర్లు, తదితరాలను కప్పి రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు.